# కేసీఆర్ నాయకత్వం గజ్వేల్‌కు గౌరవం

- అనుకున్న దానికన్నా ఎక్కువ అభివృద్ధి జరుగుతున్నది
- అభివృద్ధిలో గజ్వేల్‌ను నాలుగు దశాబ్దాల ముందు నిలిపిన సీఎం
- కార్యకర్తలే.. మాబలం..బలగం
- నేడు గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ నామినేషన్ దాఖలు
- చివరి బహిరంగ సభ 28న గజ్వేల్‌లోనే నిర్వహిస్తాం..
- ముఖ్యమంత్రికి లక్షకు పైగా మెజార్టీ ఖాయం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు
- గజ్వేల్‌లో హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి


హెలీప్యాడ్ ప్రదేశాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

గజ్వేల్, నవంబర్ 8: గజ్వేల్‌లో కేసీఆర్ ఉంటేనే గౌరవం.. మా ముఖ్యమంత్రి.. మా గజ్వేల్ అని చెప్పుకునే అవకాశం వస్తుందని ఇంకొకరికి ఇలాంటి అవకాశం ఉండదని, కేసీఆర్ సహకారంతో గజ్వేల్ అభివృద్ధిలో మూడునాలుగు దశాబ్దాలు ముందుకెళ్లిందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం సాయంత్రం గజ్వేల్‌లో హెలీప్యాడ్ ప్రదేశాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ అభివృద్ధి పదాత కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు ప్రజలు ఎప్పుడెప్పుడా కేసీఆర్‌కు ఓటు వేసేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. కరువు పీడిత గజ్వేల్‌కు కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి సస్యశ్యామలం చేశారని, ఎక్కడ చూసినా సిరులు కురిపించే పంటలు పండుతున్నాయన్నారు. ఎర్రటి ఎండల్లో కూడవెల్లి, హల్దీ వాగులు మత్తళ్లు దుంకుతున్నాయన్నారు. నాటి గతుకుల గజ్వేల్ నేడు బతుకుల గజ్వేల్‌గా, విద్యాలయాలకు, రిజర్వాయర్లకు నిలయంగా మారిందన్నారు. గజ్వేల్‌లో రింగ్‌రోడ్డు, యూజీడీ వంటి అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. గజ్వేల్‌కు గురుకుల పాఠశాలలు, హార్టికల్చర్, ఫారెస్టు, ఎడ్యుకేషన్ హబ్, డిగ్రీ కళాశాలలు వచ్చాయన్నారు. గజ్వేల్ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో కోకాకోలా కంపెనీ రావడంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వర్గల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో ఎంతో మంది మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కేసీఆర్ ఎన్నో సొసైటీలను ఏర్పాటు చేసి సభ్యత్వాలు ఇచ్చిన విషయం అందరికీ తెలుసని చెప్పారు. 24 గంటల కరెంట్‌తో తెలంగాణలో గంట కూడా ఎండడం లేదన్నారు. మా బలం బలగం పార్టీ కార్యకర్తలే అని, ఒక్క పిలుపుతో 15 వేల నుంచి 20వేల మంది వస్తారని తెలిపారు.

**గజ్వేల్‌లో నామినేషన్ వేయనున్న సీఎం కేసీఆర్**

గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి గురువారం సీఎం కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయనున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి హెలీకాప్టర్‌లో గజ్వేల్ చేరుకొని నామినేషన్ వేస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో కామారెడ్డి చేరుకొని అక్కడ నామినేషన్ వేసి ప్రసంగిస్తారు. 28న గజ్వేల్‌లో ఎన్నికల ప్రచార చివరి బహిరంగ సభ ఉంటుంది. సీఎం కేసీఆర్ నామినేషన్ పత్రాలతో కోనాయిపల్లి వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. నేడు సీఎం కేసీఆర్ రెండు సెట్ల నామినేషన్లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్ పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన రిమ్మనగూడ యువకులు


బీఆర్‌ఎస్‌లో చేరిన అనంతగిరిపల్లి యువకులు

## మంత్రి సమక్షంలో చేరికలు

గజ్వేల్ మండలం రిమ్మనగూడ, వర్గల్ మండలం అనంతగిరిపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు వంద మందికి పైగా మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు ఉన్నారు.

## సందడిగా నామినేషన్ల దాఖలు

సిద్దిపేట, నవంబర్ 8: సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి ఐదో రోజు బుధవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయని సిద్దిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 21 నామినేషన్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ తన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ తరఫున కొండ ప్రశాంత్, ఇండిపెండెంట్‌గా బొమ్మల విజయ్, ఇండిపెండెంట్‌గా గుమ్మడి శ్రీశైలం రెండు సెట్లు, ఇండిపెండెంట్‌గా బర్లె మల్లయ్య, అఖిల భారతీయ హిందూ మహాసభ పార్టీ తరఫున గాదగోని చక్రధర్ గౌడ్ –2 సెట్లు, యుగ తులసీ పార్టీ తరఫున బయ్యారం కమలాకర్‌రెడ్డి, ఇండిపెండెంట్‌గా కొలిమి మల్లేశం, ఇండిపెండెంట్ చెన్నోజు రాజు, ధర్మ సమాజం పార్టీ తరఫున కర్రోల్ల బాబు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఆర్డీవో రమేశ్‌బాబు తెలిపారు.

**నామినేషన్ వేళ ఇద్దరు బయటకు**

సిద్దిపేట, నవంబర్ 8: సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ నామినేషన్ వేస్తున్న క్రమంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓ సంఘటన చోటు చేసుకుంది. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం నామినేషన్ వేసేటప్పుడు అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంది. కాంగ్రెస్ అభ్యర్థితో పాటు ఆరుగురు అధికారి కార్యాలయంలోకి రావడంతో అక్కడున్న పోలీసు అధికారులు నలుగురే ఉండాలని చెప్పడంతో అభ్యర్థి వెంట వచ్చిన వారిలో ఒకరు బయటకి వెళ్లిపోయారు. మరొకరు వెళ్లాలని అధికారులు చెప్పడంతో అక్కడున్న నాయకులు ఎవరూ వెళ్లకపోవడం, అభ్యర్థి హరికృష్ణ సైతం ఎవరు బయటకు వెళ్లాలో చెప్పకపోవడంతో కాంగ్రెస్ సిద్దిపేట అసెంబ్లీ పరిశీలకుడు ధనుంజయ దేశ్‌ముఖ్ బయటకు వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**హుస్నాబాద్‌లో ఆరు నామినేషన్లు**

హుస్నాబాద్, నవంబర్ 8: హుస్నాబాద్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బుధవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌వో బెన్‌షాలోమ్ తెలిపారు. వొడితెల సతీశ్‌కుమార్(బీఆర్‌ఎస్), పొన్నం ప్రభాకర్(ఐఎన్‌సీ), దేవసారి తిరుపతిరెడ్డి(ఇండిపెండెంట్), అబ్బరబోయిన రాజ్‌కుమార్(ఇండిపెండెంట్), బోయిని సదన్‌మహరాజ్(ధర్మ సమాజ్ పార్టీ), కొంగంటి సందీప్(విద్యార్థుల రాజకీయ పార్టీ)లు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు 10నామినేషన్లు దాఖలయ్యాయి.

**దుబ్బాకలో ఐదు నామినేషన్లు దాఖలు**

దుబ్బాక, నవంబర్ 8: దుబ్బాక నుంచి మరో 5 నామినేషన్‌లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 11 మంది అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్లు వేశారు. బుధవారం ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు జక్కుల నర్సింలు(ముబారస్‌పూర్), దండ్ల నరేశ్(సిద్దిపేట), పెద్ద లింగన్నగారి ప్రసాద్(లింగుపల్లి), ధర్మ సమాజ్ పార్టీ తరఫున వేముల వెంకటప్రసన్న (అప్పనపల్లి), రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ తరఫున గౌటి మల్లేశ్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

# బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 8: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హుస్నాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన 120 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి కారెక్కారు. అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామానికి చెందిన 20మంది కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు.

**మంత్రి హరీశ్‌రావు సమక్షంలో..**

వర్గల్, నవంబర్ 8: వర్గల్ మండలంలోని అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్గల్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కాయిత శ్రావణ్‌కుమార్, కాయిత ప్రకాశ్, బింగి మహేశ్, కాయిత మహేశ్, చిన్న, బింగి ప్రశాంత్‌తో పాటు పలువురు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీని విజయపథంలో నడిపించడంలో చురుగ్గా పాల్గొనాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ బండ్ల కనకరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తమ్మల నర్సింలు, నాయకులు కిషన్, శంకర్, స్వామి, చాప రాజు, రవి, వెంకటేశ్, యాట సందీప్, కొల్తూర్ మహేశ్, గువ్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా..

- మరో అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- నామినేషన్ దాఖలు చేసిన బీఆర్‌ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి సతీశ్‌కుమార్



ఆర్వోకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, వినోద్‌కుమార్, పెద్దిరెడ్డి, తదితరులు

హుస్నాబాద్, నవంబర్ 8: హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి విజయం సాధిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో 2014, 18లో భారీ మెజార్టీతో గెలిపొందానని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు గెలిపిస్తారనే నమ్మకం ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చి రోడ్లు, డ్రైనేజీలు, వివిధ భవనాలు, గ్రామాల్లో సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన వందలాది మంది ప్రజలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

**సతీశ్‌కుమార్‌ను గెలిపించండి**

హుస్నాబాద్ నియోజకవర్గంపై సంపూర్ణ అవగాహన ఉన్న సతీశ్‌కుమార్‌ను ప్రజలు గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. సతీశ్‌కుమార్ చేసిన నిరంతర కృషితోనే అరవై ఏండ్లనాటి కల అయిన గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కెప్టెన్ లక్ష్మీకాంతరావు కుటుంబం పాత్ర ఎంతో కీలకమైనదని, ఆ కుటుంబం నుంచి వచ్చిన సతీశ్‌కుమార్‌కు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నదన్నారు. గౌరవెల్లి ద్వారా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు సాగునీరందగా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్‌మానేరు ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు దేవాదుల ద్వారా సాగునీరందుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం పాడిపంటలతో కళకళలాడుతుందని చెప్పారు. ఎల్కతుర్తి–సిద్దిపేట–మెదక్–నాందేడ్ హైవే నిర్మాణంతో హుస్నాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడంతోపాటు సతీశ్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**పదేండ్లలో రాష్ట్రంలో అసాధారణ ప్రగతి**

గడిచిన పదేండ్లలో తెలంగాణ అసాధారణ ప్రగతిని సాధించిందని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ విజన్, అనుభవం రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టిందన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ తేవడంతోపాటు పదేండ్లలో ఎంతో ప్రగతిని సాధించిన సీఎం కేసీఆర్‌కే రాష్ట్రాన్ని పాలించే అర్హత ఉన్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుర్చీల కొట్లాట తప్ప అభివృద్ధి ఉండదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అడ్రస్ గల్లంతయిందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారి పెత్తనం మనకు అవసరం లేదని, మన సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపించుకుందామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ఇంకా అభివృద్ధిని సాధించాలంటే సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.